క్లుప్తంగా

కంప్యూటర్ కోర్సుల్లో ఉచిత శిక్షణ

నిడదవోలు : ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని ఎస్వీఆర్కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 22వ తేదీ నుంచి నిరుద్యోగ యువతకు వివిధ కోర్సుల్లో ఉచిత శిక్షణ కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ కె.జ్యోతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియేట్ అర్హతగా ఉచిత కంప్యూటర్ (డేటా ఎంట్రీ ఆపరేటర్), పదో తరగతి అర్హతగా ఆఫీస్ అసిస్టెంట్ కోర్స్ (ఉచిత కంప్యూటర్ శిక్షణ)కు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు. వివరాల కోసం 96760 52454, 91217 14649 నంబర్లలో సంప్రదించాలన్నారు.

కాపు సంక్షేమ సేన ఉపాధ్యక్షుడిగా ఉన్నమట్ల



నల్లజర్ల: కాపు సంక్షేమ సేన గోపాలపురం నియోజకవర్గ ఉపాధ్యక్షుడిగా నల్లజర్లకు చెందిన రిటైర్డు ఉద్యోగి ఉన్నమట్ల వెంకటేశ్వరావు నియమితులయ్యారు. కాపు సంక్షేమ సేన వ్యవస్థాపక అధ్యక్షుడు చేగొండి హరిరామజోగయ్య ఆదేశాల మేరకు జిల్లా అధ్యక్షుడు పులి శ్రీరాములు ఈ ఉత్తర్వులు జారీ చేసినట్టు ఉన్నమట్ల నల్లజర్లలో గురువారం విలేకర్లకు తెలిపారు. కాపుల ఐక్యతకు కృషి చేస్తానని చెప్పారు.

చిన్నారి కుటుంబానికి నేతల పరామర్శ



మద్దూరు గ్రామంలో చిన్నారి కుటుంబ సభ్యులను పరామర్శించిన ప్రముఖులు

కొవ్వూరు: వైఎస్సార్ సీపీ మండల మాజీ అధ్యక్షుడు గురుజు బాలమురళీకృష్ణ(చిన్నారి) కుటుంబాన్ని పలువురు ప్రజాప్రతినిధులు గురువారం పరామర్శించారు. ఇటీవల ఆయన అనారోగ్య కారణాలతో మరణించారు. మద్దూరు గ్రామంలో ఆయన స్వగృహానికి వెళ్లిన నాయకులు.. చిన్నారి కుటుంబ సభ్యులను పరామర్శించి, తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. చిన్నారి మరణం వైఎస్సార్ సీపీకి తీరని లోటని పేర్కొన్నారు. కొవ్వూరు, చాగల్లు ఎంపీపీలు కాకర్ల సత్యనారాయణ, మట్టా వీరస్వామి, జెడ్పీటీసీ బొంత వెంకటలక్ష్మి, పార్టీ నిడదవోలు మండల మాజీ అధ్యక్షుడు యాళ్ల, నాయకులు ముళ్లపూడి కాశీవిశ్వనాథ్, పరిమి సోమరాజు, గారపాటి వెంకటకృష్ణ, ఎంపీటీసీ జొన్నకూటి రోహిణి కోమలి తదితరులు సంతాపం వ్యక్తం చేసిన వారిలో ఉన్నారు.

పేదల పెన్నిధి ఎన్టీఆర్

పెరవలి: తెలుగుజాతి గౌరవ ప్రతిష్టను ప్రపంచానికి చాటిచెప్పిన ఘనుడు, పేదల పాలిట పెన్నిధి ఎన్టీ రామారావు అని మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు, టీడీపీ నాయకుడు కుందుల సత్యనారాయణ అన్నారు. పెరవలి, తీపర్రు గ్రామాల్లో గురువారం ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా టీడీపీ కార్యకర్తలు, నాయకులు ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించారు.

కార్మికులు, వృద్ధులకు దుప్పట్ల పంపిణీ

తాళ్లపూడి: టీడీపీ వ్యవస్థాపకుడు, దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ వర్ధంతిని అన్నదేవరపేటలో టీడీపీ నాయకులు నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్మికులు, ఆటో డ్రైవర్లు, వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు.

దేవరపల్లి: దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ వర్ధంతిని అనేక గ్రామాల్లో గురువారం ఘనంగా నిర్వహించారు. ఎన్టీఆర్ విగ్రహాలకు టీడీపీ నాయకులు పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. దేవరపల్లిలో మాజీ ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గద్దే సుబ్రహ్మణ్యం, యాగంటి సాయిబాబు, జ్యేష్ఠ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మద్యం కేసులో ఇద్దరి అరెస్టు

కొవ్వూరు: పట్టణానికి చెందిన సిద్ధా సత్యనారాయణ అనే వ్యక్తిని అక్రమంగా మద్యం విక్రయిస్తున్న కేసులో గురువారం అరెస్టు చేసినట్టు సెబ్ ఇన్‌స్పెక్టర్ వీటీవీ సత్యనారాయణ తెలిపారు. అతని వద్ద అక్రమంగా నిల్వ ఉంచిన 23 మద్యం క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. అలాగే తాళ్లపూడి మండలం పెద్దేవం గ్రామానికి చెందిన వ్యక్తిని అరెస్టు చేసి, ఐదు క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఎస్సై జి.బసంతి, ఇతర సిబ్బంది ఈ దాడుల్లో పాల్గొన్నారు.

బ్యూటీషియన్, కుట్టు, మగ్గం కోర్సుల్లో శిక్షణ

రాజమహేంద్రవరం సిటీ: లాలాచెరువులోని స్వర్ణాంధ్ర సేవా సంస్థ ఆధ్వర్యంలో బ్యూటీషియన్, మగ్గం, టైలరింగ్ కోర్సులలో ఉచిత శిక్షణ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ సేవా సంస్థ నిర్వాహకుడు లయన్ డాక్టర్ గుబ్బల రాంబాబు తెలిపారు. ఆయన గురువారం మాట్లాడుతూ ఈ కోర్సుల్లో ప్రవేశానికి కనీసం పదో తరగతి చదివిన వారికి అవకాశం ఉంటుందన్నారు. ఫిబ్రవరి 5 నుంచి శిక్షణ తరగతులు ప్రారంభమై, 45 రోజుల పాటు జరుగుతాయన్నారు. శిక్షణలో మెటీరియల్, మధ్యాహ్న భోజనం ఉచితంగా అందించడంతో పాటు, శిక్షణ అనంతరం ఉత్తీర్ణత పత్రాలను అందిస్తామన్నారు. ఆసక్తి కలవారు 98498 47489, 94907 10850 నంబర్లలో సంప్రదించాలన్నారు.

తేలనున్న లెక్క

- నేటి నుంచి కుల గణన సర్వే
- డివిజన్‌లో 3,257 క్లస్టర్లకు 1,325 సిబ్బంది నియామకం
- సర్వే నిర్వహణకు సర్వం సిద్ధం : డీఎల్‌డీఓ



కొవ్వూరు: కులాల లెక్కలు తేల్చేందుకు రంగం సిద్ధమైంది. శుక్రవారం నుంచి డివిజన్‌లో కులగణన ప్రక్రియ ప్రారంభం కానుంది. అనివార్య కారణాలతో ఇప్పటికే రెండు సార్లు సర్వే వాయిదా పడింది. గతంలో ఇచ్చిన నివేదికల ఆధారంగా 2021 నవంబర్‌లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కుల ఆధారిత జనాభా గణన చేపట్టాలని భారత ప్రభుత్వాన్ని అభ్యర్థిస్తూ ఏపీ శాసన సభలో తీర్మానం ఆమోదించింది. సుమారు రెండేళ్లు కావస్తున్నా కేంద్రం ఎలాంటి చర్య తీసుకోలేదు. దీంతో ఏళ్ల తరబడి కలగా ఉన్న బీసీ గణనను వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. రాష్ట్రంలో కుల గణన ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. బడుగు, బలహీన వర్గాల గణాంకాలు తేలడం వల్ల ఆయా వర్గాలకు మేలు చేకూరే అవకాశం ఉంది. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంపై సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

సర్వే నిర్వహణకు అధికారులు ముందస్తు కార్యాచరణ ప్రణాళికలను సిద్ధం చేశారు. డివిజన్‌ను 3,257 క్లస్టర్లుగా విభజించి, 1,325 మంది సిబ్బందిని నియమించారు. డివిజన్ వ్యాప్తంగా ఉన్న తొమ్మిది మండలాల్లో 4,89,983 మంది ఓటర్లున్నారు. నిడదవోలు, కొవ్వూరు పురపాలక సంఘాలతో కలిపి సుమారు 6.50 లక్షల మందికి పైగా ఓటర్లు ఉన్నారు. మునిసిపాలిటీలను మినహాయిస్తే, తొమ్మిది మండలాల్లో గత స్థానిక సంస్థల ఎన్నికల సమయానికి డివిజన్‌లో 1,64,393 మంది బీసీ ఓటర్లున్నారు. పట్టణ ఓటర్లను కలిపితే ప్రస్తుతం సుమారు రెండు లక్షల మంది బీసీ ఓటర్లు ఉంటారని అంచనా. ఉప కులాల వారీగా కులగణన సర్వే ద్వారా ఏ కులాల వారు.. ఎంత సంఖ్యలో ఉన్నారనేది ఈ సర్వే ద్వారా తేటతెల్లమవుతుంది.

93 ఏళ్ల తర్వాత కుల గణన

దేశంలో 1872లో తొలిసారి జనగణన ప్రారంభమైంది. ప్రతి పదేళ్లకు ఒకసారి జనగణనతో పాటు కుల గణన యధావిధిగా నిర్వహించేవారు. 1931లో చివరిగా పూర్తి స్థాయిలో కులగణన నిర్వహించారు. ఆ తర్వాత 1941లో జనగణన చేసినప్పటికీ, రెండో ప్రపంచ యుద్ధ పరిస్థితుల కారణంగా జన గణన, కుల గణన పూర్తి స్థాయి చేయలేదు. 1951లో జనగణన చేసినప్పటికీ, కులగణన పూర్తి స్థాయిలో జరగలేదు. కేవలం ఎస్సీ, ఎస్టీలను మినహాయించి మిలిగిన గణన కులాల వారీగా చేయలేదు. సుమారు 93 ఏళ్ల తర్వత రాష్ట్రంలో కులగణన ప్రక్రియ చేపట్టారు.

సర్వే విజయవంతం చేయాలి

నిడదవోలు : ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు శుక్రవారం నుంచి ప్రారంభించనున్న కులగణన సర్వేను విజయవంతంగా చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ కేవీ పద్మావతి అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో గురువారం సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లకు కులగణన సర్వేపై అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. కమిషనర్ పద్మావతి, తహసీల్దారు ఎం.గంగరాజు మాట్లాడుతూ శుక్రవారం ఉదయం 10 గంటలకు సర్వే ప్రారంభిస్తామన్నారు. సర్వే ద్వారా ప్రజల ప్రస్తుత స్థితిగతుల ప్రామాణికంగా తీసుకుని, వారికి అవసరమైన పథకాల అమలుకు దోహదపడుతోందన్నారు. పట్టణ ప్రజలు సర్వేకు అవసరమైన సమాచారం ఇచ్చి, సహకరించాలని కోరారు.

మండలం	పనిచేసే సర్వే సిబ్బంది	మొత్తం క్లస్టర్ల సంఖ్య
చాగల్లు	116	262
దేవరపల్లి	161	313
కొవ్వూరు అర్బన్	82	244
నల్లజర్ల	172	364
నిడదవోలు అర్బన్	96	218
గోపాలపురం	98	253
నిడదవోలు రూరల్	130	332
పెరవలి	126	399
ఉండ్రాజవరం	119	361
తాళ్లపూడి	109	213
కొవ్వూరు రూరల్	116	298
మొత్తం	1,325	3,257

అందుబాటులో లేకపోతే.. సచివాలయానికే..



డివిజన్ వ్యాప్తంగా 19 నుంచి 28వ తేదీ వరకు సచివాలయ సిబ్బంది ఒకరు, వలంటీర్ కలిసి యాప్‌లో సర్వే వివరాలు నమోదు చేస్తారు. ఇంటి యాజమాని, అతని కుటుంబ సభ్యుల్లో ఒకరు వేలిముద్ర తీసుకుంటాం. వీరితో పాటు సచివాలయ ఉద్యోగి, వలంటీర్ల వేలిముద్రలు వేసిన తర్వత మాత్రమే ఆ వివరాలు యాప్‌లో అప్‌లోడ్ అవుతాయి. సర్వే సమయంలో అందుబాటులో లేకపోతే, 29 నుంచి ఫిబ్రవరి ఐదో తేదీ వరకు సచివాలయానికి వెళ్లి వివరాలు నమోదు చేసుకోవాలి. యాప్‌లో మొదట నమోదు చేసిన వివరాలన్నీ సచివాలయ లాగిన్‌లోకి వెళ్లతాయి. ఏమైనా తేడాలుంటే అక్కడ సరిచేస్తారు.సచివాలయ అడ్మిన్ కూడా వివరాలను క్షేత్ర స్థాయిలో సరిచూస్తారు. ఫిబ్రవరి 15 నాటికి కుల గణన ప్రక్రియ పూర్తవుతుంది.

– వి.శాంతమణి, డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారి, కొవ్వూరు

ప్రభుత్వానికి ప్రైవేటు స్కూళ్ల సంఘం కృతజ్ఞతలు



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న సంఘ సభ్యులు

నల్లజర్ల: ప్రైవేటు స్కూళ్ల గుర్తింపు కాల పరిమితిని మూడు నుంచి ఎనిమిదేళ్లకు పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంపై ప్రైవేటు స్కూళ్ల అసోసియేషన్ గోపాలపురం జోన్ ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపింది. దూబచర్ల సంఘమిత్రా స్కూలులో గురువారం ఈ సంఘ సమావేశం జోన్ అధ్యక్షుడు అంబటి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగింది. ఆయన మాట్లాడుతూ శాసన మండలి సభ్యులు, రాష్ట్ర సంఘ అధ్యక్షులు ఎంపీ రామచంద్రారెడ్డి ప్రభుత్వంతో సంప్రదింపులు జరపడంతో, ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందన్నారు. రానున్న రోజుల్లో నూతన విద్యా విధానానికి ప్రతి స్కూలు యాజమాన్యం అవగాహనతో మెలగాలని, అప్పుడే మనుగడ ఉంటుందన్నారు. ఈ సందర్భంగా స్టేట్‌బాడీ నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నల్లజర్ల: పోతవరం విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కోసం శుక్రవారం ఉదయం పది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏపీఈపీడీసీఎల్ నిడదవోలు ఈఈ (ఆపరేషన్స్) బి.వీరభద్రరావు తెలిపారు. ఈ కారణంగా పోతవరం, కవులూరు, సుభద్రపాలెం, నబీపేట, కృష్ణాయిగూడెం గ్రామాల్లో గృహ, వాణిజ్య, వ్యవసాయ అవసరాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తారని చెప్పారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సత్యవాడ ఉన్నత పాఠశాలలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

ఉండ్రాజవరం: సత్యవాడ ఉన్నత పాఠశాలకు చెందిన 1984–85కు చెందిన పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు గురువారం అదే పాఠశాలలో కలుసుకున్నారు. తాము చదువుకున్న రోజుల్లో జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనాడు గురువులు అందించిన చదువుతోనే నేడు ఈ స్థాయికి వచ్చామని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారికి చదువు చెప్పిన గురువులను ఘనంగా సన్మానించారు.

గోదావరిలో వ్యక్తి మృతదేహం

ధవళేశ్వరం: రామపాదాల రేవు వద్ద గోదావరిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభించినట్టు ధవళేశ్వరం ఏఎస్సై వెంకటేశ్వరరావు తెలిపారు. మృతుడి వయసు సుమారు 40 ఏళ్లు ఉంటుందని, అతడి ఒంటిపై టీ షర్టు, జీన్స్ ప్యాంటు ఉన్నాయన్నారు. ఆచూకీ తెలిసిన వారు తమకు సమాచారం ఇవ్వాలని కోరారు.

తీర్థ క్షేత్రాలు, సాగర తీరాలు వినోద కేంద్రాలు కావు



సామవేదం షణ్ముఖశర్మ

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): తీర్థ క్షేత్రాలు, సాగర తీరాలు వినోద కేంద్రాలు కావని, అవి తపోభూములని సమన్వయ సరస్వతి సామవేదం షణ్ముఖ శర్మ అన్నారు. హిందూ సమాజంలో ఆయన గురువారం 37వ రోజు ప్రవచనాన్ని కొనసాగించారు. సముద్ర జలాలలో పర్వదినాల్లో మాత్రమే స్నానం చేయాలి. ప్రాయశ్చిత్త విధులలో భాగంగా, శాస్త్ర నియమ నిబంధనలను అనుసరించి స్నానం చేయవచ్చన్నారు. ఫుడ్ అండ్ ఫన్ సెంటర్లు నెలకొల్పరాదని అన్నారు. సాగరుని ప్రసన్నం చేసుకోవడానికి దర్భాసనం మీద ఉపవాస నియమాలను పాటించి దీక్షగా ఉపాసించినా సాగరుడు ప్రసన్నం కాలేదు. 'లోకంలో శాంతం, సహనం ఇత్యాది లక్షణాలు ఉన్నవారిని అసమర్థునిగా భావించడం పరిపాటి, నేను ఇప్పుడే సాగర జలాలను ఇంకింపచేస్తాను' అని రాముడు విల్లు తీసుకున్నాడు. మేరు పర్వతం వద్ద ఉదయిస్తున్న సూర్యునిలా సాగరుడు ప్రత్యక్షమయ్యాడు. ''రామా! ప్రకృతి నియమాలకు నేను బద్ధుడిని, ఈ నియమాలను ఏర్పరిచినవాడు పరమాత్మయే, నేను నాపై సేతువు నిర్మించడానికి మార్గం సుగమం చేస్తాను.'' అని సాగరుడు చెప్పగానే, ఎక్కు పెట్టిన బాణాన్ని ఎవరిపై ప్రయోగించాలి, ఇది వ్యర్థం కారాదని రాముడు అడుగుతాడు. ఉత్తరదిశలో ద్రుమకుల్యము అనే పేరుగల ప్రదేశంలో కొందరు దుర్మార్గులు నా జలాల సాక్షిగా పాపపు పనులు చేస్తున్నారని, వారిపై నీ శరాన్ని ప్రయోగించమని సాగరుడు చెబుతాడు. విశ్వకర్మ కుమారుడయిన నీలుడు సాగరంపై సేతువు నిర్మించడానికి సమర్థుడని సాగరుడు తెలియచేస్తాడు. ''ఇతరులు ప్రస్తావించకుండా నా గుణాలను నేను ముందుగా చెప్పుకోరాదు కనుక నేను నా గుణములను గురించి ఇంతవరకు చెప్పలేదు. నేను సాగరంపై సేతువు నిర్మించడానికి సమర్థుడనే' అని నలుడు రామునికి చెబుతాడు. విభీషణునికి శరణు ఇచ్చే సమయంలో రాముడు 'నన్ను రావణుడే శరణు కోరినా, వానికి అభయం ఇస్తానని, ఇది తన వ్రతమని' అంటాడు. విష్ణుసహస్రనామంలోని 'సువ్రతః' అన్న నామంతో రాముని వ్రత లక్షణాన్ని సమన్వయం చేసుకోవచ్చునని శంకరభగవత్పాదులు విష్ణుసహస్రనామ భాష్యంలో పేర్కొన్నారని సామవేదం అన్నారు.

ఇలాంటి ప్రభుత్వానికే మా మద్దతు

- అభివృద్ధి, సంక్షేమంపై ప్రజల సంతృప్తి
- గడప గడపకూ.. కార్యక్రమం నిర్వహించిన ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు



ఖండవల్లిలో లబ్ధిదారుకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు

పెరవలి: ప్రభుత్వ సంక్షేమ పథకాలందుతున్నాయి, గ్రామంలో అభివృద్ధి పనులు చూస్తున్నాం, ఇళ్లకే పింఛన్లు పంపిణీ చేయడం బాగుంది, వృద్ధులకు పడిగాపులు, శ్రమ లేకుండా పోయింది, ఇలాంటి ప్రభుత్వానికే మా మద్దతు.. అంటూ ఎస్సీ, బీసీ ఏరియా వాసులు ముక్తకంఠంతో స్పష్టం చేశారు. పెరవలి మండలం ఖండవల్లి, ఉసులుమర్రు గ్రామాల్లో గురువారం బీసీ, ఎస్సీ ఏరియాల్లో ఎమ్మెల్యే జి.శ్రీనివాస్ నాయుడు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖండవల్లి ఈ గ్రామంలో ఇప్పటి వరకు రూ.90 కోట్లతో, ఉసులుమర్రులో రూ.24 కోట్లతో సంక్షేమం, అభివృద్ధి పనులు చేశామంటూ, మరోసారి అవకాశం కల్పిస్తే మరిన్ని పనులు చేస్తానని హామీ ఇచ్చారు. గత ప్రభుత్వ హయాంలో ఏ పనులూ జరగలేదని ప్రజలే చెబుతున్నారు, మేము పనులు చేసి మీ ముందుకు వచ్చామంటూ పేర్కొన్నారు. గత టీడీపీ పాలనలో సెంటు భూమి పేదలకు ఇవ్వలేదని, ఇప్పుడు ఎన్నికలు సమీపించటంతో కల్లబొల్లి కబుర్లు చెబుతూ, విపక్ష నేతలు అమలు కానీ హామీలు ఇస్తారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ ప్రభుత్వంలో సంక్షేమం అందని ఇళ్లు ఉండరాదని, లబ్ధి పొందని గ్రామస్తులు ఉండరాదనే సంకల్పంతో పనిచేశామన్నారు. రాబోయే ఎన్నికలు పేదలకు, పెత్తందార్లకు మధ్య జరుగుతాయని, పేదల సంక్షేమ ప్రభుత్వం మనదని చెప్పారు. ఈ సందర్భంగా రెండు గ్రామాల్లో 560 ఇళ్లను ఆయన సందర్శించి, లబ్ధిదారులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షులు వీరమళ్ల సత్యనారాయణ, జెడ్పీటీసీ కొమ్మిశెట్టి రామాంజనీ, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు పొట్టి రాంబాబు, మండల గృహసారథుల అధ్యక్షులు రామడుగుల సూర్యానారాయణ, ఎంపీటీసీ బొకే వెంకటేశ్వర్లు, పల్లేటి రవి, జన్ని వరలక్ష్మీదేవి, పార్టీ గ్రామ అధ్యక్షులు కంద వెంకన్న, దొలూరి శ్రీనువాసు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కోలాహలంగా 'ఆడుదాం ఆంధ్రా'



నల్లజర్లలో జరుగుతున్న క్రీడా పోటీలు



పెద్దేవం వాలీబాల్ జట్టుకు నగదు బహుమతి అందించిన సర్పంచ్

నల్లజర్ల: ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు నల్లజర్ల జెడ్పీ హైస్కూలులో కోలాహలంగా జరుగుతున్నాయి. ఇందుకు నాలుగు క్రీడా మైదానాలు రూపొందించారు. క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్, కబడ్డీ, ఖోఖో పోటీలు షెడ్యూలు ప్రకారం జరుగుతున్నట్టు ఎంపీడీఓ రాజశేఖర్, ఎంఈఓ వై.సత్యానారాయణ తెలిపారు. క్రీడాకారులకు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశామన్నారు. ఇక్కడ 98కి పైగా పోటీలు నిర్వహించినట్టు చెప్పారు. గ్రామ స్థాయి నుంచి వచ్చే జట్లతో సచివాలయ సిబ్బంది, వలంటీర్లు దగ్గరుండి తీసుకువస్తున్నారన్నారు. ఈ క్రీడల్లో పాల్గొన్న క్రీడాకారుడు, ఘంటావారిగూడెం పంచాయతీ సభ్యుడు కడలి దుర్గాప్రసాద్ మాట్లాడుతూ ఆటల పోటీలు సమర్థంగా జరుగుతున్నాయని, ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేశారు.

మండల ప్రథమ స్థానంలో పెద్దేవం

తాళ్లపూడి: వేగేశ్వరపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద జరిగిన ఆడుదాం ఆంధ్రాలో వాలీబాల్ ఫైనల్ మ్యాచ్‌లో పోచవరంపై పెద్దేవం జట్టు గెలుపొంది, తాళ్లపూడి మండలంలో ప్రథమ స్థానంలో నిలిచింది. రెండో స్థానాన్ని పోచవరం పొందింది. నియోజకవర్గ స్థాయి పోటీలకు అర్హత సాధించిన పెద్దేవం జట్టును సర్పంచ్ తిగిరిపల్లి వెంకటరావు, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు తోట రామకృష్ణ అభినందిస్తూ రూ.3 వేల నగదు ప్రోత్సాహకాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అలేఖ్య సువర్చల, వార్డు సభ్యులు మైలవరపు రాధాకృష్ణ, ఛాయా సోమేశ్వర స్వామి ఆలయ చైర్మన్ యండపల్లి వీరవెంకట సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కాటన్ బ్యారేజీకి మంచి రోజులు

- రూ.70 కోట్లతో ఆధునీకరణకు ప్రతిపాదనలు
- ఇప్పటికే శరవేగంగా సాగుతున్న రోడ్డు పనులు



ధవళేశ్వరంలోని కాటన్ బ్యారేజీ రోడ్డు

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీకి మంచి రోజులు రానున్నాయి. ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపడంతో త్వరలో పూర్తి ఆధునీకరణకు మార్గం సుగమం కానుంది. ఇటీవల ప్రపంచ బ్యాంక్ బృందం బ్యారేజీని సందర్శించి ఇరిగేషన్ అధికారుల నుంచి వివరాలు సేకరించింది. సుమారు రూ.70 కోట్లతో బ్యారేజీ ఆధునీకరణ పనులకు ప్రతిపాదనలు పంపారు. వీటిలో హోయిస్ట్ మెకానిజమ్, బ్యారేజ్ గేట్లు, గేర్ బాక్స్, లిమిట్ స్విచ్, బ్రేక్ యునిట్, మోటార్లు, వైర్ రోప్ తదితర పనులను ఆధునికీకరణలో చేపట్టేందుకు ప్రతిపాదించారు.

పూర్తి స్థాయిలో అభివృద్ధి

బ్యారేజీ నిర్మాణం పూర్తయి 40 ఏళ్లు గడవడంతో పూర్తి స్థాయి ఆధునీకరణ పనులు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంది. మరోపక్క కాటన్ బ్యారేజీ రోడ్డు ఆధునీకరణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. ఇప్పటికే రోడ్డుపైన ఉన్న లేయర్‌ను తొలగించారు. రోడ్డును పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసేందుకు రూ.2 కోట్లు కేటాయించారు. రోడ్డుకు సంబంధించి మొత్తం 6.8 కిలోమీటర్ల మేర పనులు జరుగుతున్నాయి.

ప్రతిపాదనలు పంపాం

కాటన్ బ్యారేజీ పూర్తి స్థాయి ఆధునీకరణకు రూ.70 కోట్లతో ప్రతిపాదనలు పంపాం. ఇటీవల బ్యారేజీ పరిశీలనకు వచ్చిన ప్రపంచ బ్యాంకు బృంద సభ్యులకు చేపట్టాల్సిన పనులను వివరించాం. ఇప్పటికే బ్యారేజీ రోడ్డు ఆధునీకరణ పనులు చురుగ్గా జరుగుతున్నాయి.

– జి శ్రీనివాసరావు, ఇరిగేషన్ సర్కిల్ ఎస్ఈ, ధవళేశ్వరం

తాత్కాలిక మరమ్మతుల ద్వారా సమస్య మొదటికి వస్తుండటంతో, బ్యారేజీ రోడ్డు పూర్తి స్థాయి అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి సారించింది.

సమస్య పరిష్కారానికి ప్రత్యేక దృష్టి

బ్యారేజీ రోడ్డు సమస్య పరిష్కారంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. మరమ్మతు పనులతో త్వరగా రోడ్డు పాడవుతుండటంతో పూర్తి స్థాయి రోడ్డు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టింది. గతంలో మరమ్మతుల సమయంలో సీసీ రోడ్డుపై తారు రోడ్డు వేశారు. అయినా తరచూ ధ్వంసమవుతోంది. దీనిని దృష్టిలో ఉంచుకొని బ్యారేజీ రోడ్డు పూర్తి స్థాయి అభివృద్ధికి ప్రభుత్వం రూ.2 కోట్లు కేటాయించింది. కలెక్టర్ కె.మాధవీలత ఎప్పటికప్పుడు క్షేత్ర స్థాయిలో పనులను పర్యవేక్షిస్తున్నారు. ధవళేశ్వరం, మద్దూరు, ర్యాలి, విజ్జేశ్వరం ఆర్మ్‌లలో రోడ్డును పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తున్నారు. ఈ నెలాఖరుకు నిర్మాణ పనులు పూర్తి చేసి, ట్రాఫిక్‌ను పూర్తి స్థాయిలో అనుమతించే విధంగా అధికారులు ప్రణాళికలు రూపొందించారు.

రథం నిర్మాణానికి అంగీకారం

కడియం: కడియపులంకలోని ముసలమ్మ అమ్మవారి రథం నిర్మాణానికి శ్రీ విశ్వేశ్వర హైటెక్‌నర్సరీ అధినేతలు కాశీవిశ్వేశ్వరరావు, అమ్మిరాజు సోదరులు ముందుకొచ్చారు. ఏటా ముక్కనుమ రోజున రథోత్సవం ఉంటుంది.